ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
బుధవారం 22 అక్టోబరు 2025



ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి

కోనరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ ముజఫరుద్దీన్ అన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సకాలంలో డబ్బులు అందజేస్తున్నామని అన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత పూర్తి డబ్బులు చెల్లిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఏఈ రాజశేఖర్, కార్యదర్శి సతీష్, ఏఎంసీ డైరెక్టర్ సాసాల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



సిరిసిల్లలో టపాసులు కాలుస్తున్న మహిళలు

- వ్యాపార సముదాయాల్లో లక్ష్మీపూజలు
- టపాసుల మోతలు.. జిల్లావ్యాప్తంగా సంబరాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సౌభాగ్యాన్నిచ్చే దీపావళి సంబరాలను రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా దేదీప్యమానంగా.. అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. సోమవారం రాత్రి వ్యాపార సముదాయాల్లో, ఇళ్లలో లక్ష్మీపూజలను ఘనంగా నిర్వహించుకున్నారు. సిరిసిల్లమానేరు తీరంలో టపాసుల దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేయగా కొనుగోళ్లతో సందడి కనిపించింది.

ఎక్కడ చూసినా వెలుగులు వెదజల్లే టపాసులు, ధ్వనులు, మెరుపులతో ఆకట్టుకునే పేలుడు సామగ్రి దీపావళికి ప్రత్యేక శోభనిచ్చింది. దీపకాంతులతో సిరిసిల్ల కేంద్రంలో వెలుగు జిలుగులతో కనిపించింది. వ్యాపారులు తమ దుకాణాలను విద్యుత్ లైట్లతో అలంకరించుకుని లక్ష్మీదేవి పూజలను వైభవంగా జరుపుకున్నారు. సిరిసిల్ల ప్రధాన వ్యాపార కూడళ్లతో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక శోభ కనిపించింది. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మహిళలు కేదారీనాథ్ వ్రతాలు, నోములు జరుపుకున్నారు.

జోరుగా టపాసుల విక్రయాలు..

దీపావళి సంబరాలు సిరిసిల్ల ప్రజలు అంబరంగా జరుపుకున్నారు. సోమవారం సిరిసిల్ల మార్కెట్ జనంతో కిటకిటలాడింది. మానేరుతీరంలో టపాసుల అమ్మకాలు జోరుగా సాగాయి. రూ500నుంచి రూ 600 వరకు కిలో చొప్పున తూకంవేసి అమ్మారు. ఈసారి మార్కెట్‌లోకి బంతిపూలు ముంచెత్తాయి. గత సంవత్సరం రూ 100 కిలో ధర పలుకగా ఈసారి రూ 40నుంచి 50కి విక్రయాలు జరిగాయి.. పండుగ సందర్భంగా వచ్చే బచ్చీసలు, చెక్కెర పల్లీలు, కడ్డీలు అమ్మకాలు సాగాయి. స్వీట్ల కొనుగోలు కూడా ఎక్కువగానే కొనసాగాయి. మార్కెట్ సందడి మధ్య దీపావళిని ఘనంగా జరుపుకున్నారు.



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మాసానాం కార్తీకం ఉత్తమం.. మాఘమాసం.. శివప్రీతికరం, ధనుర్మాసం.. వైష్ణవ ప్రీతికరం... కానీ ఈ కార్తీకమాసం శివకేశవ ప్రీతికరం... అందుకే పవిత్రమైన మాసంగా భావిస్తారు. కార్తీక మాసం దైవ సంబంధికమైన వ్రతాలకు, నోములకు, ఉపవా సాలకు, శుభకార్యాలకు ఎంతో ముఖ్యమైనది. శివకేశవులకు ఇష్టమైన ఈ మాసంలో దీపారాధన ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఆయామాసాల్లో చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరే ఆ మాసానికి వస్తుంది. కృత్తికా నక్షత్రంపై చంద్రుడు పూర్ణుడై ఉండడం వల్ల ఈ మాసానికి కార్తీక మాస మని పేరు. ఈ మాసంలో కృత్తిక నక్షత్రానికి దీపారాధనకు సోమ వారాలకు ప్రాధాన్యత ఉంది. ఈ మాసం ప్రారంభం నుంచి సూర్యోదయానికి పూర్వమేలేచి నది స్నానం ఆచరించి పొడి బట్టలతో దీపారాధన చేస్తారు. మహిళలు వ్రతాలు, నోములను ఆచరిస్తారు. ఈ మాసంలో యోగ సాధన కూడా ఎంతో అనువైనదిగా చెప్పుకుంటారు. మే, జూన్‌లో ఉండే అధిక ఎండలు కానీ, డిసెంబర్, జనవరిలో ఉండే అధిక చలి కానీ ఈ మాసంలో ఉండవు. వాతావరణం ప్రశాంతంగా, నిర్మలంగా ఉంటుంది. అందుకే ఉదయం లేచి నది స్నానాలు చేయడం వల్ల ఆరోగ్యం చక్కగా ఉంటుందని, మనస్సు ఆహ్లాదంగా ఉంటుందని భావి స్తారు. కార్తీక మాసంలో బ్రహ్మణుడికి దీపం దానం చేస్తే ఉత్తమ ఫలితాన్ని ఇస్తుందని.. తులసీ, మారేడు, ఉసిరి కాయలతో శివాలయాల్లో విష్ణు ఆలయాల్లో దీపాలు వెలిగించిన వారికి శుభాలు కలుగుతాయని భావిస్తారు. తులసీ సన్నిధిలో దేవాలయంలో దీపం వెలిగించే వారికి ఐశ్వర్య సిద్ధి కలగడమే కాకుండా ఈ మాసంలో శివార్చన చేసిన వారికి గ్రహ దోషాలు పోతాయని భావిస్తారు. ఉసిరికాయపై దీపాలు పెట్టి వెలిగించడం శుభాల నిస్తుంది. కార్తీక ఏకాదశి నుంచి కార్తీక పున్నమి వరకు మహిళలు భీష్మపంచక వ్రతం చేస్తారు. ఈ ఐదు రోజులు శివమంత్రం, విష్ణుమంత్రం, ఉపదేశం పొందడం ఎంతో ఫలితాన్ని ఇస్తుందని భావిస్తారు. అంతేకాకుండా పరమేశ్వరుడికి పంచామృతాలతో అభి షేకం చేయడం, ఆవు నేతి దీపం వెలిగించడం, పరశివునికి ఇష్ట మైన అభిషేకాలు, లక్షపత్రి పూజలు, కోటి బిల్వాచర్చన చేస్తే సకల పాపాలు పోతాయని భావిస్తారు. మహిళలు దీపాతోరణాలతో ప్రత్యేక పూజలతో మంగళవారం కార్తీక మాసం ప్రారంభమైంది.

ఆచరించాల్సిన నియమాలు

కార్తీక మాసంలో కొన్ని నియామాలు పాటించడం ఎంతో ముఖ్యం. స్నానం చేసిన తరువాత స్నానం చేసి పొడి బట్టలతో దీపా రాధన చేయడం మంచిదని భావిస్తారు. ఈ మాసంలో జ్వాల తోరణాలతో వెలుగులు నింపుతాయి. ప్రతి దేవాలయాన్ని దీపాలతో మహిళలు అలం కరించడంతో శోభాయమానంగా కనిపిస్తాయి. అంతేకాకుండా మహిళలు నదులలో దీపాన్ని దానంగా ఇస్తారు. ఈ దీపాలు మనిషిలోని అజ్ఞానాన్ని, చీకటిని తొలగించి జ్ఞానాన్ని నింపుతాయని భావిస్తారు.

మహిళల దీపారాధన..

దేవుని ముందు దీపం వెలిగించడంలో పూర్వీకులు నూనెను కర్మఫలంగాను, వత్తిని శరీరంగాను, జ్వాలను ప్రాణం గా భావి స్తారు. కర్మఫలం అనే నూనె ఉన్నంత వరకే వత్తి అనే శరీరంలో జ్వాల అనే ప్రాణం ఉంటుందని భావిస్తారు. కర్మఫలం పూర్తి అవగానే ప్రాణం శరీరాన్ని వదిలి పెడుతుం దని చెబుతారు. సూర్యో దయానికి పూర్వమే లేచి నది

ప్రత్యేక పూజలు..

కార్తీక మాసంలో నోములు, వ్రతాలతోపాటు కొన్ని ప్రత్యేక పూజలు కూడా నిర్వహిస్తారు. కార్తీకశుక్లపక్షం మొదటి రోజున గోవర్ధన పూజ నిర్వహిస్తారు. రెండో రోజున భగిని హస్తభోజనం అనే పండుగ సోదరుల సంక్షేమం కోసం సోదరిమణులు నిర్వహిస్తారు. శుద్ధ చవితిరోజు నాగులచవితి పండుగను నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. దీంతో పాటు దేవోత్థాని ఏకాదశి పండుగ, వన భోజనాలు, కార్తీక పూర్ణిమ రోజున తులసి పూజలు నిర్వహిస్తారు. అలాగే, కార్తీక మాసంలో ఉసిరి చెట్టు వద్ద విష్ణు పూజలు చేస్తారు. దివ్య క్షేత్రాల్లో విష్ణువుకు పూజ చేసినంత ఫలితం లభిస్తుందని భావిస్తారు.

దేవుని పూజకు ఉపయోగించే ఆసనం(పీఠ) వేరే పనికి ఉపయోగించరాదు. దేవుని పూజలు చేసేటప్పుడు తూర్పు ముఖంగా కూర్చోవాలి. ఏకాదశి రోజున ఉపవాసం ఉండాలి. బూడిద గుమ్మడి కాయ మంగళవారం ఇంటి సింహద్వారానికి కట్టాలి. దీని ద్వారా దృష్టి దోషాలు పోతాయి. మట్టి, ఇత్తడి ప్రమిదల్లో దీపాలు వెలిగించాలి. ఉసిరి కాయ దీపం వల్ల పాపాల నివారణ, పుష్పదీపం వల్ల జ్ఞానం ప్రాప్తిస్తుంది. కార్తీక పౌర్ణమి మహా కార్తికి స్నానం పుణ్యప్రదం అరుణోదయ వేళ శివాలయంలో కానీ, విష్ణు ఆలయంలో కానీ గడపాలి. దీపా రాధన చేస్తే ఎంతో భవిష్యత్ ఉంటుంది. శ్రీ మహాగణపతికి వెలి గిస్తే అన్ని కార్యాలు సిద్ధిస్తాయని,

- మిగతా 8లో

యాదవులు ఐక్యతతో హక్కులను సాధించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొమురయ్య

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : యాదవులు ఐక్యతతో హక్కులను సాధించుకోవాలని యాదవ సంఘం మహాసభ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సాగని కొమురయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యాదవులను ఏకం చేయడం కోసం సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన యాదవ సంఘం సమావేశంలో యాదవులు ఆదివారం రోజున మాంసం, మద్యం తీసుకోకూడదని ఏకగ్రీవ తీర్మానం చేసి సభ్యుల ప్రతిజ్ఞ చేశామన్నారు. ఈ అంశంను ఉమ్మడి జిల్లాలో ముందుకు తీసుకుపోతామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ చైతన్యం కలిగించడం కోసం నాలుగు జిల్లాల్లోని యాదవులందరికి సంఘం పక్షాన ఈనెల 24న కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఒక్కరోజు శిక్షణలు ఉంటాయని యాదవ సోదరులు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యాదవులు రాజకీయంగా వెనకబడి ఉన్నారని ఐక్యతతో హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతియాదవ్, నాయకులు రవీందర్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, మహేందర్ యాదవ్, భాస్కర్‌యాదవ్, కృష్ణకాంత్‌యాదవ్, రాములుయాదవ్, వేణుగోపాల్‌యాదవ్, పరుశరాములు యాదవ్, కొమరయ్యయాదవ్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

'ఉపాధి' యాక్షన్ ప్లాన్‌కు కసరత్తు

- 2026-27 సంవత్సరానికి పనుల గుర్తింపునకు గ్రామసభలు - జిల్లాలో 97,878 జాబ్ కార్డులు.. 1.99 లక్షల మంది ఉపాధి కూలీలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలను నివారించే దిశగా కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2006 సంవత్సరం నుంచి ఈ పథకం నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. ఉపాధిహామీ పథకంలో పారదర్శకత కోసం సాంకేతిక వనరులను కూడా ఉపయోగిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2026-27 సంవత్సరానికి ఉపాధిహామీలో కూలీలకు పనులు కల్పించడానికి యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు కసరత్తు ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీల పరిధిలో 97878 జాబ్ కార్డులు ఉండగా 1.99 లక్షల మంది కూలీలు ఉన్నారు. యక్టివ్ లేబర్ కార్డులు 61 వేలు ఉండగా 93 వేలమంది యాక్టివ్ కూలీలుగా ఉన్నారు.

స్థానిక అవసరాలపై దృష్టి..

జిల్లాలోని 260 గ్రామపంచాయతీలో గ్రామీణ అభివృద్ధి శాఖ 58 రకాల పనులను చేపట్టడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగిసిపోతున్న నేపథ్యంలో జిల్లాలోని గ్రామాల్లో స్థానిక అవసరాల మేరకు గ్రామసభల ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రామపంచాయతీలో భవన నిర్మాణాలు, అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు, పాఠశాలల్లో టాయిలెట్లు, ప్రహరీలు, కిచెన్‌షెడ్లు వంటి పనులను గుర్తిస్తున్నారు. మట్టి పనులను తగ్గించి ఇతర పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు వంద రోజుల పని కల్పించాల్సిన లక్ష్యంగా గ్రామసభల్లో పనులు, బడ్జెట్ వివరాలపై తీర్మానాలు చేసి ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి కేంద్ర ప్రభుత్వం అనుమతి తీసుకుంటారు. ఇందుకోసం గ్రామ సభల నిర్వహిస్తున్నారు.



ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలు(ఫైల్)

ఈసారి ఇందిరమ్మ ఇళ్లకు లింకు..

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఉపాధి పథకాన్ని ఈసారి అనుసంధానం చేయనుంది. ఇందుకోసం ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు ఉత్తర్వులు జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 7918ఇళ్లు మంజూరుకాగా, 5332ఇళ్ల పనులు నడుస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జాబ్‌కార్డులు ఉన్నవారికి, లేనివారు కూడా దరఖాస్తు చేసుకుంటే ఆమోదం పొందేలా చర్యలు తీసుకున్నారు. దీని ద్వారా ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ఉపాధిహామీ ద్వారా రూ.27వేలు, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా రూ.12 వేలు అందుతాయి.

నేడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బుధవారం వరిదాన్యం కొనుగోలు కేంద్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభిస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు దళారీల బారిన పడి నష్టపోవద్దని 21 గ్రామాలలో వరిదాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నందున నాయకులు పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య మంగళవారం పరామర్శించారు. రాచర్లగొల్లపల్లిలోని యువకుడు శ్రీకాంత్ ఇటీవల మస్కట్ దేశంలో అనారోగ్యంతో చనిపోయాడు. గర్జనపల్లి గ్రామంలోని బీఆర్ఎస్ నాయకుడు, కోనరావుపేట సింగిల్‌విండో డైరెక్టర్ ఆనందం గుండెపోటు మృతిచెందాడు. ఆ కుటుంబాలను పరామర్శించారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకులు సుభాష్, రమేశ్, ప్రకాశ్, జబ్బార్, జగదీష్, సురేశ్, రాజిరెడ్డి, చాంద్‌పా షా, సురేశ్‌నాయక్, రవి, రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాడి గేదెల పెంపకంతో ఆర్థికాభివృద్ధి..



మహిళా రైతులతో డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు పాడి పరిశ్రమపై దృష్టి సారించి గేదెల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు అన్నారు. వీర్నపల్లి మండలం భూక్యతండా, బావుసింగ్‌నాయక్ తండా గ్రామాల్లో మహిళా పాల ఉత్పత్తిదారులకు పాల దిగుబడి సాధించే విధానంపై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పాడి గేదెల పెంపకం చేపట్టేందుకు ప్రభుత్వం, సంస్థ ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం పాలక్యాన్లను అందజేశారు. కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచులు భారతి, మంజుల, వీర్నపల్లి డెయిరీ మాజీ డైరెక్టర్ లింబాద్రి, సంస్థ మేనేజర్ రవీందర్, అసిస్టెంట్ మేనేజర్ రాజిరెడ్డి, సూపర్‌వైజర్ నాగరాజు, నాయకులు శ్రీరాంనాయక్, లింగమూర్తి, బావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నాలా కన్వర్షన్‌కు దరఖాస్తుదారుల ఎదురుచూపులు

- రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

తంగళ్లపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నాలా కన్వర్షన్ కోసం ఆన్‌లైన్లో నమోదు చేసుకుని ఏడాది అవుతున్నా అనుమతులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ధరణితో గత ప్రభుత్వ హయాంలో నాలా కన్వర్షన్ కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజా పాలనలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ధరణి రద్దు చేసి భూభారతి తీసుకువచ్చామని ప్రభుత్వం చెబుతుండగా, ఆచరణలో ఆశించిన ఫలితం రావడం లేదని తెలుస్తోంది. మండలంలో నాలా కన్వర్షన్ కోసం సుమారు పది దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. వాటిని తహసీల్దార్ పరిశీలించి అర్హత కలిగిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపించారు. ఈ విషయమై తహసీల్దార్ జయంత్‌ను వివరణ కోరగా కన్వర్షన్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపించినట్లు చెప్పారు. ఏడాది గడుస్తున్నా తమకు న్యాయం జరగడం లేదని బాధితులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నాలా కన్వర్షన్ దరఖాస్తులపై దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఇదే విషయంపై సిరిసిల్ల ఆర్డీవోను ఫోన్‌లో వివరణ కోరగా కంప్యూటర్ ఆపరేటర్లు లేక ఇబ్బందులు తలెత్తాయని, అందుకే నాలా కన్వర్షన్ దరఖాస్తుల పరిశీలనలో ఆలస్యం అవుతోందని వివరణ ఇచ్చారు.

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం : ఎస్పీ



నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేష్ బి. గితే



పోలీసు అమరుల కుటుంబాలతో ఎస్పీ మహేష్ బి.గితే

చందుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలు చిరస్మరణీయమని ఎసీ మహేష్ బి. గితే అన్నారు. చందుర్తి మండలం లింగంపెట గ్రామ శివారులోగల అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులతో కలసి ఎస్పీ నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు శోక్‌శ్రస్త్ చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారన్నారు. జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో 8మందికి పైగా పోలీసులు అసువులు బాసారని, వారి త్యాగఫలం వల్లే గతంకంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని, పోలీసుల త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరులు అందించిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని, దేశ సరిహద్దుల్లోని ఆక్సాయ్‌చిన ప్రాంతంలో పహారాకాస్తున్న 10మంది సీఆర్పీఎఫ్ పోలీసులను 1959లో ఇదేరోజున చైనా సైనికులు హతమార్చారని, అప్పటినుంచి వారి త్యాగాలను స్మరిస్తూ అక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినం జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయా కుటుంబాలకు జ్ఞాపికలను అందించారు. పోలీస్ అమరవీరుల స్మరిస్తూ ఈనెల 21నుంచి 31వ తేదీ వరకు రక్తదాన శిబిరాలు, సైకిల్‌ర్యాలీ, క్యాండిల్‌ర్యాలీ, 2కే రన్, ఓపెన్‌హౌస్, వ్యాసరచనపోటీలు, ఫోటో, వీడియో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, వీరప్రసాద్, శ్రీనివాస్, మొగిలి, శ్రీనివాస్, నటేష్, ఆర్ఐ రమేష్, యాదగిరి, ఎస్ఐలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కమాండెంట్ సురేష్ తదితరులు

● సిరిసిల్ల రూరల్ : ప్రజల కోసం ప్రాణాలను అర్పించిన పోలీసుల త్యాగాలు మరువలేనివని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎంఐ సురేష్ అన్నారు. సిరిసిల్లఅర్బన్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో మంగళవారం పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి కమాండెంట్ ఎంఐ సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌కమాండెంట్ జగదీశ్వరరావు, ఎస్ సురేష్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్, ఆర్ఐలు కుమారస్వామి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మొరం లేక కార్మికులకు ఉపాధి కరువు

చందుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇసుక మొరం లేక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. చందుర్తి మండలం, రామన్నపేట-తిమ్మాపూర్ గ్రామంలో ఏఐటీయూసీ జిల్లా 4వ మహాసభ కరపత్రంను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారులు ప్రతిరోజూ ఇసుక, మొరం తరలింపునకు అనుమతులు ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు వివాహానికి రూ.లక్ష, 55 ఏళ్ల వయసుగల కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. జిల్లాలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీ, సివిల్ సప్లై, 2 ఏఎన్ఎం, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, మున్సిపల్, గ్రామపంచాయతీ, దేవస్థానం, బీడీ, పవర్‌లూం అనేక రంగాల కార్మికుల కోసం పోరాటాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన వేములవాడలోని గుమ్మి పుల్లయ్య భవన్‌లో జరిగే మహాసభకు అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, గంగయ్య తదితరులు, పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నుంచి భార్యను తోసేసిన భర్త

● తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి



మృతి చెందిన రజిత

నస్పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో ఫ్లైఓవర్‌పై నుంచి తోసివేయడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మంచిర్యాల జిల్లా నస్పూర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సుల్తానాబాద్ మండలం కునుకుల గ్రామానికిచెందిన రజిత(30)కు మందమర్రి పట్టణం మూడవ జోన్ గాంధీనగర్‌కుచెందిన జగన్నాథం కుమారస్వామితో 2013లో వివాహం జరిగింది. వీరికి దనుష్(12), అభిలాష్(8), సాత్విక్(5) ముగ్గురు కుమారులు ఉన్నారు. దంపతుల మధ్య గొడవలు జరగగా పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. 15రోజుల కింద మందమర్రి నుంచి పిల్లలతోకలిసి దంపతులు కునుకుల గ్రామానికి దసరా పండగకు వెళ్లారు. పిల్లలను అమ్మమ్మ ఇంట్లోనే వదిలి ఆదివారంరాత్రి మోటార్ సైకిల్‌పై భార్య రజితతో కుమారస్వామి మందమర్రికి బయలుదేరారు. నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీసీసీ సమీపంలోగల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు రాగానే మాట్లాడుతామని చెప్పి ద్విచక్రవాహనం ఆపాడు. రజితతో మాట్లాడుతూనే ఆమెను కిందకు తోసేసాడు. రోడ్డుపై ప్రయాణించే వారు పడిపోయిన మహిళనుచూసి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అశోక్, ఎస్సై ఉపేందర్‌రావు సిబ్బంది వెళ్లి పరిశీలించారు. రజితతండ్రి పులి దిండి రాజేశం ఫిర్యాదు మేరకు హత్యకేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చొప్పదండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన పిట్టల లచ్చయ్య(49) ఈనెల16న పురుగుల మందు తాగగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్ఐ నరేష్ రెడ్డి కథనం మేరకు పిట్టల లచ్చయ్య మద్యానికి బానిసై మద్యం తాగిన మత్తులో 16నపురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 19న రాత్రి మరణించినట్లు, మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌రెడ్డి తెలిపారు.

మెట్ల పైనుంచి జారిపడి పెయింటర్ మృతి

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన కొండ శేఖర్(26) అనే పెయింటర్ సోమవారం రాత్రి మెట్లపైనుంచి జారిపడి మృతిచెందాడు. పట్టణంలోని సంజీవయ్య నగర్‌కు చెందిన శేఖర్ పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. గాంధీచౌరస్తాలో ఉన్న ఓ వైన్‌షాప్‌నకు వెళ్లి పర్మిట్‌రూంలో మద్యం సేవించి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మెట్లపై నుంచి జారి కిందపడ్డాడు. శేఖర్ తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్సకోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికేయువకుడు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

చెట్టు పైనుంచి కిందపడి ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ వేడుకలకు మామిడాకులు కోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి కిందపడి ఒకరు మరణించారు. కరీంనగర్ సరస్వతీనగర్‌లో సోమవారం చోటుచేసుకున్న ఘటన స్థానికంగా విషాదాన్నినింపింది. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాలప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని సరస్వతీనగర్‌కు చెందిన పాకాల కోమల్‌రెడ్డి(47) సోమవారం దీపావళిపండుగ సందర్భంగా మామిడాకులు తెంపుదామని చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కిందపడగా తల, ఇతర శరీరభాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు చికిత్సకోసం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు వెల్లడించారు. కోమల్‌రెడ్డితల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి



నదీమొద్దీన్(ఫైల్)

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి శివారులోని ఓ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో మంచిర్యాలజిల్లా కోటపల్లి మండలం అన్నారం గ్రామానికిచెందిన మహమ్మద్ ఖాజా నదీమొద్దీన్(17) ఇంటర్ మొదటిసంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి మిత్రులతో కలిసి హాస్టల్ ఎదురుగా ఉన్న హోటల్‌లో టిఫిన్ తినేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపువెళ్తున్న లారీ నదీమొద్దీన్‌ను వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి సుమయ షిరిన్ ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్‌పై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సచిన్(ఫైల్)

ధర్మపురి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో జగిశెట్టి సచిన్ (29) అనేయువకుడు ఉరివేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నతనం నుంచి సచిన్‌కు కుడిచేయి, భుజంనొప్పి ఉండగా నెల రోజులక్రితం హైదరాబాద్‌లోని అపోలోరీచ్‌లో ఆపరేషన్ చేయించుకున్నాడు. ఇటీవల సచిన్‌కు కుడిచేయి మట్ట వంగి కనిపించడం, నరాలబలహీనత ఏర్పడటంవల్ల మానసికంగా కుంగిపోయాడు. సోమవారం ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.తండ్రి శంకర్‌గుజరాత్‌లో ఒకఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. తల్లి ప్రమీల ఫిర్యాదుమేరకు శవపంచనామా జరిపి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

అమాయకులకు గాలం



కొండగట్టులో చెరువును చదును చేసిన వ్యాపారులు

● నిరుపయోగమైన భూములే అక్రమార్కుల పెట్టుబడి
● తక్కువ ధరలకు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూముల కొనుగోలు..
● స్కీం పేరుతో అధిక ధరలకు విక్రయం

మల్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సాగుకు యోగ్యం కాని, చెరువులు, కుంటల్లో గల ఎఫ్‌టీఎల్ భూములను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి అనంతరం ఆఫర్ల పేరుతో ఎక్కువ ధరకు విక్రయాలు చేస్తూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. పలు ప్రాంతాల్లో భూములకు రెక్కలు రాగా అక్కడే తక్కువ ధరలకు భూములు అమ్ముతామని, అంతే కాకుండా కొన్ని సంవత్సరాల్లోనే పెట్టుబడి పెట్టిన డబ్బులు తిరిగి ఇస్తామని అమాయకులకు వల వేస్తున్నారు. దీంతో తక్కువ ధరకు భూములు వస్తున్నాయని కొంత మంది భూములు కొనుగోలు చేసి మోసపోతున్నారు.

జగిత్యాల జిల్లా కేంద్రానికి ఆనుకొని మల్యాల మండలం ఉండడంతో కరీంనగర్-జగిత్యాల రోడ్డులో గల భూములకు డిమాండ్ పెరిగింది. మల్యాల మండలంలోని రాజారం, పోతారం, నూకపల్లి, రామన్నపేట, కొండగట్టు, దొంగలమర్రి వరకు ఇక్కడి భూములకు గుంటకు రూ.10 లక్షలకు పైగా డిమాండ్ ఉంది. దీన్ని ఆసరా చేసుకున్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పలువురి నుంచి తక్కువ ధరకు నిరుపయోగ భూములు కొనుగోలు చేసి అమాయక ప్రజలకు ఎక్కువ ధరకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇటీవల ముత్యంపేట గ్రామ పరిధిలోని కొండగట్టులో గల తుమ్మచెరువులో గతంలో కొనుగోలు చేసిన పట్టాదారుల వద్ద రూ.లక్షకు కొనుగోలు చేసి రూ.ఐదు లక్షలకు విక్రయించడానికి సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో భూమి తక్కువ ధరకు భూమి వస్తోందని పలువురు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారు. అయితే పోలీసుల రంగప్రవేశంతో అది ప్రస్తుతానికి ఆగింది. ఈ చెరువు విస్తీర్ణం సుమారు వంద ఎకరాలు కాగా సగం పట్టా భూములే ఉన్నాయి. ఇందులో అవి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండగా రెండు రోజుల క్రితం చెరువును చదును చేసి వాటి విక్రయానికి విందు సమావేశం ఏర్పాటు చేశారు. దీనిపై పలువురు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇలాంటి భూ వ్యవహారాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి.

రూ.లక్షకు పది వేలు ఇస్తామని ప్రచారం

తక్కువ ధరలకే అంటూ వ్యాపారులు ప్రజలకు చెబుతుండడంతో పాటు కొనుగోలు చేసిన భూమికి రిజిస్ట్రేషన్ అయ్యాక కూడా రూ.లక్షకు పదివేల చొప్పున సుమారు రెండు వందల రోజుల వరకు తిరిగి చెల్లిస్తామని బ్రోచర్లు ముద్రించి ప్రచారం చేస్తున్నారు. దీంతో జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి వందలాది మంది భూముల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములను అంటగడుతున్నారు.



చెరువులో రహదారి ఏర్పాటు చేసిన వ్యాపారులు

వ్యాపారులు, కొనుగోలుదార్ల వద్ద వసూలు చేసిన సొమ్ములను ఇతర చోట్ల పెట్టుబడులు పెడుతూ కొద్ది రోజుల పాటు అనుకున్న విధంగా చెల్లించి అనంతరం ముఖం చాటేస్తున్నారు. ఆయా భూముల్లో నిర్మాణాలు చేపట్ట రాదని అధికారులు స్పష్టం చేయడంతో కొనుగోలు దారులు లబోదిబోమంటున్నారు. ఇటీవల రాజారం పరిధిలో 30గుంటల భూమిని జగిత్యాలకు చెందిన కొందరికి రూ.50 లక్షలకు వ్యాపారులు విక్రయించారు. ఇక్కడ గుంట భూమి విలువ పది లక్షలు ఆపై ఉండగా విక్రయిం చిన భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంతో పాటు రూ.లక్షకు రోజుకి పదివేలు ఇస్తామని చెప్పి కొద్ది రోజులు అయ్యాక ముఖం చాటేశారు. కొండగట్టు సమీపంలోని ఓ టౌన్‌షిప్‌లో కూడా ఇలాంటి వ్యాపా రం కోసమే విందు సమావేశం ఏర్పాటు చేయగా అక్కడి ప్లాట్లు ఒకేచోట లేకపోవడంతో కొనుగోలు దారులు ఆసక్తి చూపనట్లు తెలిసింది.

వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్, ముత్యంపేట

చెరువులు, కుంటల పరిధిలోని ఎఫ్‌టీఎల్ ఏరియాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి. తక్కువ ధరలు అంటూ అమాయకులను మోసగించడం సరికాదు. కొండగట్టులో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై నియంత్రణ ఉంచాలి.

నిర్మాణాలకు అనుమతులు ఉండవు

ప్రవీణ్, ఎంపీవో, మల్యాల

చెరువుల సమీపంలో గల పట్టా భూములు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే కొనుగోలుకు మాత్రమే అవకాశం ఉంటుండగా ఎలాంటి నిర్మాణాలకు అను మతులు ఇవ్వడం కుదరదు. చెరువు పరిధిలోని భూములు ఎఫ్‌టీఎల్‌లో లేవని ఇరిగేషన్ అధికారులు ధ్రువీకరించి నిరభ్యంతర పత్రం అందిస్తేనే అనుమ తుల విషయం పరిశీలించడం జరుగుతుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడుట్రాక్టర్లను బొమ్మకల్, నగునూరు వాగు వద్ద మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌డ్రైవర్లు రాకేష్‌రెడ్డి, సంపత్, అజయ్‌పై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామం మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ట్రాక్టర్ యాజమానులు పైడిపల్లి శ్రీకాంత్, తిప్పని సంతోష్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని బొమ్మకల్ హాస్టల్‌లో లక్ష్మినర్సింహ అనేయువకుడు గతనెల23న తనఫోన్ పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ నల్గొండలో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను లక్ష్మినర్సింహకు అప్పగించారు. సెల్‌ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ నిరంజన్‌రెడ్డి అభినందించారు.

దహన సంస్కారాలకు వెళ్లిన వారిపై తేనెటీగల దాడి

వీణవంక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన కల్వల చంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందగా దహనసంస్కారాలు చేస్తుండగా తేనెటీగలు దాడిచేశాయి. దీంతో మృతుడి కుమారుడు కల్వల సమ్మయ్య, సమ్మక్క, మహేష్, కొమ్మగాళ్ల నాంపల్లికి గాయాలయ్యాయి. గ్రామస్థులు 108వాహనానికి సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది ఈఎంటి ఐలవేని కుమార్ ప్రథమ చికిత్సచేసి అనంతరం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సింగరేణి ఏరియా ఆసుపత్రిలో గర్భస్థ శిశువు మృతి

● డాక్టర్ల నిర్లక్ష్యమే అంటూ ఆందోళనకు దిగిన బంధువులు, నాయకులు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గోదావరిఖని, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో గర్భస్థశిశువు మృతి చెందడంతో వైద్యులే కారణమంటూ ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు, పలుపార్టీ నాయకులు ఆందోళనకు దిగారు. గోదావరిఖని 7ఎల్‌ఈపీ కాలనీకి చెందిన కొంపెల్లి లింగయ్య కుమార్తె సుప్రియను సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ప్రసవం కోసం సోమవారం రాత్రి చేర్పించారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న సుప్రియకు చికిత్సను అందించాలని వైద్యులను వేడుకున్నప్పటికీ దీపావళి సెలవు కావడంతో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వైద్యురాలు ఇందిర స్కానింగ్ చేయించుకోమని సుప్రియకు సూచించగా స్కానింగ్ చేయడానికి సిబ్బంది లేకపోవడంతో రాత్రి అంతా ఆసుపత్రిలో ఉన్నది. మంగళవారం ఉదయం ఆపరేషన్ చేస్తామని థియేటర్‌లోకి తీసుకెళ్లిన వైద్యులు మళ్లీ స్కానింగ్ కోసం ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేయడంతో సుప్రియ గర్భంలో ఉన్న శిశువు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో సుప్రియ బంధువులు, బీజేపీ నాయకులు కొండపర్తి సంజీవ్, బీఆర్ఎస్ నాయకుడు ఇరుగురాళ్ల శ్రావణ్ ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ సింగరేణి ఆసుపత్రిలో కనీసం స్కానింగ్ మిషన్ లేక పోవడం దౌర్భాగ్యమన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన డ్యూటీడాక్టర్, గైనకాలజిస్ట్ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న వారికి పోలీసులు నచ్చజెప్పడానికి ప్రయత్నించినా బంధువులు సీఐ ఇంద్రసేనారెడ్డితో వాగ్వాదానికి దిగారు. సింగరేణి కార్మిక సంఘ నాయకులు తుమ్మల రాజిరెడ్డి, ఆరెల్లి పోషం సూపరింటెండెంట్ అంబికను కలిసి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే గర్భంలో శిశువు మృతి చెందిందని, ఇక్కడ చికిత్స అందకున్నా రోజుల తరబడి రోగులను అడ్మిట్ చేసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, స్కానింగ్ మిషన్లు పనిచేయనప్పుడు ఎందుకు మరమ్మతు చేయించడం లేదని ప్రశ్నించారు. బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రేమ.. పెళ్లి.. విషాదాంతం

● నెల రోజుల వ్యవధిలోనే దంపతులిద్దరూ మృతి



మృతిచెందిన సంతోష్, గంగోత్రి(ఫైల్)

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న నెల వ్యవధిలోనే దంపతులు మరణించిన సంఘటన ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండీ గ్రామంలో చోటుచేసుకుంది. ఎర్దండీ గ్రామానికి చెందిన బోదాసు సంతోష్, గంగోత్రిలు ప్రేమించుకొని పెద్దలను ఒప్పించి నెలక్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. ఈనెల 3న దసరా పండుగ నేపథ్యంలో సంతోష్, గంగోత్రిలు అదే గ్రామంలో నివాసం ఉంటున్న గంగోత్రి అమ్మగారి ఇంటికి భోజనానికి వెళ్లారు. భోజన సమయంలో వాగ్వాదం చోటు చేసుకుని అదేరోజు గంగోత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అయితే భార్య మరణాన్ని జీర్ణించుకోలేని భర్త సంతోష్ మనస్తాపానికి గురవడంతో సంతోష్‌ను అతడి తల్లిదండ్రులు ఆదిలాబాద్‌లో నివాసం ఉంటున్న బంధువుల ఇంటికి పంపించారు. కాగా మంగళవారం సంతోష్ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు సమా చారం అందడంతో తల్లిదండ్రులు హుటా హుటిన ఆదిలాబాద్ వెళ్లారు. సంతోష్ ఎలా మృతిచెందాడనే విషయం తెలియలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న నెల రోజుల వ్యవధిలోనే ఇరువురు మరణించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

యువకుడిపై కేసు

చందుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని, పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ చల్లుకొని ఆత్మాహుతికి యత్నించిన సంఘటన మండలంలోని మూడపల్లిలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పిట్టల అజయ్ అనే యువకుడు వేములవాడ నుంచి తిమ్మాపూర్‌కు వెళుతున్నాడు. మూడపల్లి వద్ద పోలీ సులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా అజయ్‌బ్రీత్ అనలైజర్ పరీక్షలకు నిరాకరించి, పోలీసుల విధులకు ఆటంకం కల్పిస్తూ ఒంటిపై పెట్రోల్ చల్లుకున్నాడు. ఈ సంఘటనలో అజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

జులాయిల వీరంగం..

● మూడు కార్ల అద్దాలు ధ్వంసం

కోల్‌సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో జులాయిలు, మందుబాబులు, గంజాయి బ్యాచ్ ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మేదరిబస్తీలోని సెయింట్‌మేరి పాఠశాల మైదానంలో సోమవారం అర్ధరాత్రి కార్ల అద్దాలను ధ్వంసంచేశారు. మైదానంలో రోజూ సుమారు 20నుంచి 30వరకు కాలనీవాసుల కార్లు పార్కింగ్ చేస్తుంటారు. ఇక్కడంతా చీకటిమయంగా ఉండడంతో గంజాయి, మద్యం బాబులకు అడ్డాగా మారింది. కార్ల మధ్యలో ఖాళీస్థలంలో దర్జాగా కూర్చొని మద్యం, గంజాయి సేవిస్తుంటారని పేర్కొంటున్నారు. సోమవారం అర్ధరాత్రి ముచ్చకుర్తి శ్రీనివాస్, మదిర రవితోపాటు మరో వ్యక్తికి చెందిన కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. కార్ల మధ్యలో ఖాళీసీసాలు పడవేయడం, బానెట్లపై సీసాలు, తినుబండారాలు వదిలేస్తున్నారని పేర్కొన్నారు. మేదరి బస్తీలో కార్ల అద్దాలను ధ్వంసం చేసిన వారిని పట్టుకుని పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో మంగళవారం ఆగిఉన్న ఆటో ట్రాలీని బైక్ ఢీకొని ధర్మారం మండలకేంద్రానికి చెందిన తుమ్మల చంద్రయ్య యాదవ్‌కు తీవ్ర గాయాలైనాయి. తుమ్మల చంద్రయ్య దీపావళి పండుగ నిమిత్తం బంధువుల ఇంటికి జమ్మికుంట మండలంలోని కోరపల్లికి బైక్‌పై వెళుతున్నాడు. ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన నిలిచిఉన్న ఆటోట్రాలీని ఢీకొన్నాడు. ఈప్రమాదంలో ఆయనకు కాలితో పాటు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చంద్రయ్యను 108లో కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

మానకొండూర్: మండలంలోని వన్నారం గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన బొమ్మ రమేశ్(36) అనే యువకుడు గొర్రెల మందకాడికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా డీసీఎం వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేశ్‌కు తీవ్రగాయాలు కాగా 108లో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

నెత్తురోడిన రహదారులు

● పండుగ పూట రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి
● గంగాధరలో కారును వెనక నుంచి ఢీకొట్టిన బైక్
● గొల్లపల్లిలో ఎదురెదురుగా ఢీకొన్న రెండు ద్విచక్రవాహనాలు



గంగాధరలో చెట్టును ఢీ కొన్న కారులో మల్లయ్య మృతదేహం



మల్లయ్య(ఫైల్)

గంగాధర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై వంశీకృష్ణ తెలిపినవివరాల ప్రకారం.. గంగాధర మండలం కొండన్నపల్లికి చెందిన ప్రైవేటుపాఠశాల యజమాని తొర్రికొండమల్లయ్య(55) తన కారు(ఏపీ15ఏఎల్ 9792)లో భార్య, మేనత్తను తీసుకుని దీపావళి పండుగకు కరీంనగర్ నుంచి వస్తున్నాడు. ఇదే సమయంలో కరీంనగర్ నుంచి ఉత్తరప్రదేశ్‌కుచెందిన ఇమ్రాన్‌షా కరీంనగర్ నుంచి ద్విచక్రవాహనం(టీఎస్08జీడబ్ల్యు 2730)పై అతివేగంగా వస్తూ కొండన్నపల్లి శివారులో మల్లయ్య కారును వెనక నుంచి బలంగా ఢీ కొట్టాడు. దీంతోకారు అదుపుతప్పి రోడ్డు పక్కనచెట్టుకు ఢీకొనగా డ్రైవింగ్ చేస్తున్న మల్లయ్య తలకు తీవ్రగాయాలై సీటులోనే మృతి చెందాడు. కారును వెనక నుంచి ఢీకొట్టిన ఇమ్రాన్‌షా రోడ్డుపైపడగా బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. దీపావళి నోములు జరుపుకు నేందుకు కరీంనగర్ నుంచివస్తున్న మల్లయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గొల్లపల్లిలో..



శ్రీకాంత్(ఫైల్)

గొల్లపల్లి : గొల్లపల్లి మండలకేంద్రం శివారులో సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని అల్లూరు రాఘవరెడ్డి(60), బిదారి శ్రీకాంత్(29) అనే ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. గొల్లపల్లి మండలం గోవిందుపల్లె గ్రామానికి చెందిన అల్లూరు రాఘవరెడ్డి నూతన ఇంటినిర్మాణం చేపట్టి కొంతకాలంగా కుటుంబంతో కలిసి గొల్లపల్లి మండలకేంద్రంలో అద్దెభవనంలో నివాసం ఉంటున్నాడు. దీపావళి సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఇంటి దగ్గర దీపాన్ని వెలిగించేందుకు రాఘవరెడ్డి తన భార్య సుగుణతో ద్విచక్రవాహనంపై వెళ్లి తిరుగుపయనమయ్యాడు. అదేసమయంలో వెల్గటూర్ మండలం రాంనూర్ గ్రామానికిచెందిన బిదారి శ్రీకాంత్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురెదురుగా రెండుబైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అల్లూరు రాఘవరెడ్డి, బిదారి శ్రీకాంత్‌లు అక్కడికక్కడే దుర్మరణం చెందగా సుగుణకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో పండగపూట రెండుగ్రామాల్లో తీవ్రవిషాదం అలుముకుంది. సమాచారం తెలుసుకున్న ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సైకృష్ణాసాగర్‌రెడ్డి వెంటనే సంఘటనాస్థలికి తరలివచ్చి పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం జగిత్యాలజిల్లా ప్రధానాసుపత్రికి తరలించిప్రమాద వివరాలపై ఆరాతీశారు. తీవ్రంగా గాయపడిన సుగుణను చికిత్సనిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగాఉన్నట్లు బాధితకుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీకాంత్ మద్యం సేవించి అతివేగంగా, అజాగ్రత్తగావాహనం నడపడంవల్ల ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. రాఘవ రెడ్డి కోడలు రమ్య ఇచ్చినఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కృష్ణా సాగర్ రెడ్డి తెలిపారు.

మహిళ హత్యకేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న టౌన్ సీఐ కృష్ణ

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళ హత్య కేసులో ప్రధాన నిందితుడైన బీహార్ రాష్ట్రంలోని సహస్ర జిల్లాలోని కుమార్ గంజ్‌కు చెందిన రుడల్ సదా(36) అనేవ్యక్తిని మంగళవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన రూడల్ సదా, రామ్డిక్స్ సదా అనే ఇద్దరు వ్యక్తులు సిరిసిల్ల పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించారు. ఇందులో భాగంగా వేములవాడ అర్బన్ మండలంలోని కొడుముంజ గ్రామానికి చెంది అలకుంట రమ అనే మహిళతో పరిచయం పెంచుకున్నారు. ఆమెతో సంబంధం పెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో మార్చి 19, 2024న కూలిపని ముగిసిన తర్వాత మద్యం తీసుకొని తమ అద్దె ఇంటికి తీసుకెళ్లి ముగ్గురు కలిసి తాగారు. అనంతరం ఇద్దరు నిందితులు మద్యం మత్తులో ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె తిరగబడింది. దీంతో ఎవరికైనా చెబుతుందనే అనుమానంతో రమపై రాడుతో దాడిచేసి హత్య చేశారు. ఈ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కొద్ది రోజులకే రామ్డిక్స్ సదాను అరెస్ట్‌చేయగా, రూడల్ సదా ఫోన్ నంబర్స్ మార్చుతూ తప్పించుకొని తిరిగాడు. సాంకేతికత ఆధారంగా హైదరాబాద్‌లోని అల్వాల్‌లో ఉంటున్నాడని తెలుసుకున్న పోలీసులు రూడల్‌సదాని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

ధర్మపురి క్షేత్రంలో వైభవంగా దీపావళి


ధర్మపురి ఆలయంలో సహస్ర దీపాలు అలంకరణ

ధర్మపురి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దీపావళి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాల్లో ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ధనలక్ష్మీ పూజలు జరిపారు. రాత్రి వేళలో ప్రధాన ఆలయంలో సహస్ర దీపాలంకరణ జరిపారు. స్వామి వారల సేవలను అశ్వ వాహనం పై పురవీధుల గుండా ఊరేగింపు జరిపించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో దీపావళి సంద ర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో దీపాలం కరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులతో పాటు అధికా రులు, భక్తులు పాల్గొన్నారు.

రాజన్నకు నరకచతుర్థశి ప్రత్యేక పూజలు

- అద్దాల మండపంలో ఘనంగా ధనలక్ష్మీపూజ
- హంస వాహనంపై స్వామివారల ఊరేగింపు


హంస వాహనంపై ఉత్సవమూర్తుల ఊరేగింపు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో నరక చతుర్థశిని పురస్కరించుకుని రాజరాజేశ్వర స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4.30 గంటల వరకు సుప్రభాత హారతి చేపట్టగా నరకచతుర్థశి, దీపావళి పండుగ మంగళహారతి, అభ్యంగనం, ఆలయ శుద్ధిగావించారు. ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి ప్రాతఃకాల పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు నరకాసురవధ పురాణకాలక్షేపం తదుపరి సాయంత్రం 6.30 నుంచి స్వామివారి కల్యాణ మండపంలో ధనలక్ష్మీపూజను నిర్వహించారు.

హంస వాహనంపై ఊరేగిన స్వామివారలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలోని ఉత్సవమూర్తులు హంస వాహనంపై కొలువుదీరగా ఈవో రమాదేవి, ఉద్యోగులు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ముందుగా అంతరాలయంలో ఊరేగిన స్వామివారు అనంతరం పురవీధుల్లో ఊరేగింపును నిర్వహించారు. భక్తులు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ మొక్కులు చెల్లించుకున్నారు.

అట్టహాసంగా ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలు


చెస్ ఆడుతున్న విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలు జిల్లా కేంద్రంలోని రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలబాలికల చదరంగ పోటీలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ ప్రారంభించారు. పోటీల్లో కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలోని 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ చదరంగంతో గొప్ప ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. మేథో సంపత్తికి చెందిన క్రీడ కావడంతో విద్యార్థులు ఈ క్రీడపై దృష్టి సారించాలన్నారు.

ఇందులో గెలుపొందిన విద్యార్థులు వచ్చే నెలలో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డాల శ్రీనివాస్, జిల్లా పేట అధ్యక్షుడు వేల్పుల సురేందర్, ఆర్బీటర్ కర్ణాకర్ రెడ్డి, ఓదెల, ఎలిగేడు మండలాల చెస్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, సతీష్ బాబు, నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, వెంకటేష్, ఖాజాబీ, కుమార్ పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో ఎవరికి వారే..

- పోటాపోటీగా కాంగ్రెస్ ప్యానళ్లు
- నామినేషన్ల తర్వాతే బీఆర్‌ఎస్, బీజేపీ నిర్ణయం
- స్వతంత్ర ప్యానల్‌తో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో అర్బన్ బ్యాంకు ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు మరో రెండు రోజులు గడువు ఉంది. గతంలో బ్యాంకు చైర్మన్లుగా పనిచేసిన వారు ప్యానళ్ల ఏర్పాటుకు వ్యూహం రూపొందిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఇటీవలి వరకు నామినేటెడ్ చైర్మన్‌గా కొనసాగిన గడ్డం విలాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ ప్యానల్‌ను రూపొందిస్తున్నారు. అదే పార్టీకి చెందిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మరో ప్యానల్ రూపొందించడానికి ప్రయత్నాలు ప్రారంభించారని ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్‌లో పోటీ ప్యానళ్లు తయారవుతున్నాయని వార్తలు వస్తుండగా బీజేపీ, బీఆర్‌ఎస్ ఆచీ తూచి వ్యవహరి స్తున్నాయి. అర్బన్ బ్యాంకులో సభ్యత్వం కలిగి ఉండి డైరెక్టర్లుగా పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తున్న వారితో బీజేపీ, బీఆర్‌ఎస్ నామినేషన్లు వేయిస్తున్నాయి. నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత పార్టీకి చెందిన వారు ఎందరున్నారో చూసి బలమైన వ్యక్తులతో ప్యానళ్లు రూపొందించాలనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సూచన మేరకు..

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సూచన మేరకు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు నేతృత్వంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ప్రాథమికంగా అర్బన్ బ్యాంకు ఎన్నికల విషయంలో ఒక అవగాహనకు వచ్చారు. బండి సంజయ్‌కుమార్ సోమ వారం వరకు అందుబాటులో లేక పోవడంతో ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదు. నామినేషన్లు ముగిసిన తర్వాత తనతో భేటీ అయి ప్యానల్ విషయంలో ఒక నిర్ణయం తీసుకుం టారని చెబుతున్నారు. అర్బన్ బ్యాంకుకు గతంలో చైర్మన్‌గా పనిచేసిన మాజీ మేయర్ డి శంకర్ నేతృత్వంలో ప్యానల్ రూపొందడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.



అధికారికంగా ప్రకటించని బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ అధికారికంగా ఈ విషయంలో ఏ ప్రకటన చేయక పోయినా పార్టీకి చెందిన బ్యాంకు సభ్యత్వం ఉన్నవారిని డైరెక్టర్లుగా నామినేషన్ వేయమని సూచించారని, ఆ తర్వాత ఒక నిర్ణయానికి వద్దామని చెప్పినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తిగా కర్ర రాజశేఖర్ రెండు సార్లు బ్యాంకు చైర్మన్ పదవిని చేపట్టారు. ఈసారి ఆయన ఇండిపెండెంట్‌గా తన ప్యానల్‌ను రూపొందించుకుంటున్నారు.

12 మంది డైరెక్టర్లు ఉండే ప్యానల్‌ను ఇప్పటికే తొమ్మిది మందిని ఖరారు చేసుకు న్నారని, మరో ముగ్గురి విషయంలో నామినేషన్లు ముగిసే వరకు ఒక నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు. కర్ర రాజ శేఖర్‌తోపాటు గతంలో డైరెక్టర్లుగా పనిచేసిన బొమ్మరాతి సాయి కృష్ణ, తాడ వీరారెడ్డి, ముద్దసాని శ్వేత(క్రాంతి), బాశెట్టి కిషన్, తాటికొండ భాస్కర్, వరాల జ్యోతి, బండి ప్రశాంత్‌దీపక్, షమి యోద్దీన్‌ను డైరెక్టర్లుగా ఇప్పటికే ప్యానల్‌లో చేర్చుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

అర్బన్ బ్యాంకు ఎన్నికల నోటిఫికేషన్ రాగానే కాంగ్రెస్ ఆశావహులంతా మంత్రి పొన్నం ప్రభాకర్ వద్దకు వెళ్లి పోటీచేసే విషయమై చర్చించి ప్యానల్ నిర్ణయించాలని కోరినట్లు సమాచారం. ఆయన ముందుగా నామినేషన్ వేయండి... తర్వాత ఆలోచిద్దాం.. పార్టీ గుర్తుపై ఈ ఎన్నికలుజరుడం లేదు కదా.. అన్నట్లు చెబుతున్నారు. మరోవైపు తాను మంత్రిగా ప్యానల్ రూపొందిస్తే ఎమ్మెల్యేలు తమతమ ప్రాంతాల నుంచి కొన్ని పేర్లు సూచించి డైరెక్టర్లుగా పోటీకి అవకాశం కల్పించమని కోరవచ్చని, అప్పుడు ఇబ్బందులు తలెత్తుతాయనే కారణంగానే మంత్రి ప్రభాకర్ ఆశావహులను నామినేషన్లు వేయమని సూచించి ఉంటారని ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్‌లో పోటీ ప్యానళ్లు తయారవుతున్నాయి.. అన్న అంశం బీఆర్‌ఎస్, బీజేపీలో ఈ ఎన్నికల విషయమై కొంత చర్చకు దారి తీస్తున్నాయి. ఈ రెండు పార్టీలు కూడా తమతమ డైరెక్టర్లను గెలిపించుకొని ఆ తర్వాత చైర్మన్ విషయం ఆలోచించే అవకాశం లేకపోలేదని కూడా చెబుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన తర్వాతే పార్టీ అనే ముద్ర పడకుండా కర్ర రాజశేఖర్ మాజీ డైరెక్టర్లతో కూడిన స్వతంత్ర ప్యానల్‌ను రూపొందించుకొని పోటీకి దిగుతున్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు

కరీంనగర్, జగిత్యాల, గంగాధరలో బ్రాంచీలు ఉన్న కరీంనగర్ అర్బన్ బ్యాంకులో కరీంనగర్ జిల్లాలో 7,272 మంది సభ్యులుగా ఉండగా, జగిత్యాల జిల్లాలో 2,015 మంది ఓటు హక్కును కలిగి ఉన్నారు. వీరంతా 12 మంది డైరెక్టర్లను ఎన్నుకోవలసి ఉంటుంది. వారిలో నుంచి ఒకరు చైర్మన్ పదవిని చేపడతారు. మంగళవారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న స్ర్కూటినీ ఉంటుంది. 25 వరకు ఉపసంహరణకు గడువు. నవంబరు 1న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తారు. కరీంనగర్ జిల్లా సభ్యులకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో, జగిత్యాల జిల్లా సభ్యులకు జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

తొలిరోజు మూడు నామినేషన్లు

తొలిరోజు ముగ్గురు అభ్యర్థులు ఐదు నామినేషన్ సెట్లను ఎన్నికల అధికారికి అందజేశారు. ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో మనోజ్‌కుమార్ నామినేషన్లను స్వీకరించారు. డైరెక్టర్ పదవులకు ముప్పిడి సునీల్‌కుమార్, కంజర్ల రేణుక రెండేసి సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. మహ్మద్ షమియోద్దీన్ ఒక సెట్ నామినేషన్ వేశారు. మొత్తం ముగ్గురు అభ్యర్థులు ఐదు నామినేషన్ల సెట్లను అందజే సినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్ మనోజ్‌కుమార్ తెలిపారు.

దత్తాత్రేయ స్వామి దర్శనానికి సౌకర్యం కల్పించండి..

మంత్రి పొన్నంను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

బోయినపల్లి అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరదవెల్లి దత్తాత్రేయస్వామి దర్శనానికి సౌకర్యం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కూన రవీందర్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. దత్తాత్రేయ స్వామి గుట్ట చుట్టూ మిడ్ మానేరు జలాలు ఉండడంతో నిత్య పూజలతోపాటు భక్తులకు దర్శనం కరువైంది. ఈ విషయంపై ఆంధ్రజ్యోతిలో శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయం పర్యాటకంపై శీత కన్ను అనే శీర్షిక ప్రచురితమైంది.

ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి సమస్యను వివరించారు. స్పందించిన మంత్రి శాశ్వత పరిష్కారానికి ఆలయం వరకు వంతెన నిర్మించాలని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి, టూరిజం శాఖ ఎండీ వల్లూరి క్రాంతికి లేఖ రాశారు.

తలనీలాల టెండర్ రద్దు

రెండు రోజుల్లో మరో నోటిఫికేషన్

మల్యాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో గురువారం నిర్వహించతలపెట్టిన తలనీలాల టెండర్‌ను రద్దు చేసినట్లు ఈవో శ్రీకాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం తరుపున సేకరించి భద్రపరిచిన వాటితో పాటు కాంట్రాక్టర్ సేకరించి జీఎస్టీ చెల్లించకపోవడంతో దేవస్థానం ఆధీనంలో ఉన్న తలనీలాలకు అధికారులు టెండర్లకు ఏర్పాటు చేశారు.

కాగా జీఎస్టీ చెల్లింపు అంశంపై సదరు కాంట్రాక్టర్ దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో తలనీలాల టెండర్ నోటిఫికేషన్ రద్దు చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో రేపు జరగాల్సిన టెండర్ రద్దు చేసి రెండు రోజుల్లో మరో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

హైదరాబాద్ అండర్ 19 క్రికెట్ జట్టుకు శ్రీవల్లి ఎంపిక



ఇల్లంతకుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన కట్ట శ్రీవల్లి హైదరాబాద్ అండర్ 19 క్రికెట్ జట్టుకు ఎంపిక అయ్యింది. కట్ట లక్ష్మారెడ్డి, ఉమారాణిల చిన్న కూతురు అయిన శ్రీవల్లి గతంలో బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే హైదరాబాద్ ఉమెన్స్ జట్టుకు ఎంపికయి ప్రతిభ కనబర్చింది. ఈనెల 26నుంచి ముంబాయిలో బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే పోటీలలో శ్రీవల్లి పాల్గొననుంది. ఫాస్ట్‌బౌలర్ అయిన శ్రీవల్లి విద్యాభ్యాసం కరీంనగర్‌లో జరుగుగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతోంది. శ్రీవల్లి ఎంపికపై క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

పక్కాగా మొక్కజొన్న కొనుగోళ్లు



- రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ ద్వారా 102 కేంద్రాల ఏర్పాటు
- కొనుగోలు కేంద్రాల్లో బయోమెట్రిక్
- రైతులకు మద్దతు ధరలు దక్కడమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో మక్కలకు మద్దతు ధరలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఆధార్‌తో పాటు బయోమెట్రిక్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకవచ్చింది. ఈ మేరకు కొనుగోలు కేంద్రాలకు బయోమెట్రిక్ పరికరాలను సరఫరా చేశారు. మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఆయా జిల్లాల్లో 102 కేంద్రాలను ఆరంభిస్తున్నది. ఈ నెల 16వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. క్వింటాల్ మక్కలకు మద్దతు ధర 2,400 రూపాయలుగా నిర్ణయించారు.

గత ఏడాది కంటే ఈ ఏడాది మద్దతు ధర 175 రూపాయలు పెరిగింది. ఈ నెల మొదటి వారం నుంచే మొక్కజొన్న కోతలు ప్రారంభమయ్యాయి. పంటను కోసి ఆరబెట్టిన రైతులు కొనుగోలు కేంద్రాలు లేక పోవడంతో కొందరు రైతులు తక్కువ ధరకే వ్యాపారులకు, దళారులకు మక్కలను విక్రయించారు. వ్యాపారులు మద్దతు ధరకు ఎక్కడా కూడా కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. క్వింటాల్‌కు రెండు వేల నుంచి 2,100 రూపాయలకు మించి వ్యాపారులు ధర చెల్లించలేదని రైతులు తెలిపారు. దీంతో క్వింటాలు 250 నుంచి 300 రూపాయల వరకు నష్టపోతున్నారు. మద్దతు ధర దక్కక రైతులు ఎకరం పంటకు ఆరు వేల నుంచి 6,500 రూపాయలు నష్టపోతున్నారు.

ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సాధారణ విస్తీర్ణానికి మించి రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు. సాధారణ విస్తీర్ణం 5,21,206 ఎకరాలు కాగా, రైతులు 6,44,652 ఎకరాల్లో పంట వేశారు. తద్వారా ఎకరానికి సరాసరి 25 క్వింటాళ్ల చొప్పున 16.11 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారులు అంచనా వేశారు. ఇప్పటికే మక్కల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. 30 శాతానికి పైగా రైతులు వ్యాపారులు, మధ్య దళారులకు పంటను విక్రయించారు.

అక్రమాలకు చెక్..

మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో జరిగే అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఈ ఏడాది నుంచి బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తీసుకవచ్చింది. గతంలో రైతుల పేరిట మక్కలను కొనుగోలు చేసే విధానం ఉండేది. రైతుల నుంచి తక్కువ ధరకు వ్యాపారులు, మధ్య దళారులు కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కై రైతుల పేరిట మద్దతు ధరకు విక్రయించి సొమ్ము చేసుకునే వారు. దానిని నివారించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది రైతుల వేలిముద్రలు తీసుకోవాలనే నిబంధన విధించింది. ప్రతి సీజన్‌లో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల పేరిట క్రాప్ బుకింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటారు. ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్‌లో సంబంధిత రైతుల పేర్లు నమోదై ఉంటేనే ఆ రైతులు తీసుకవచ్చిన మక్కలను కొనుగోలు చేయనున్నారు.

రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాల్సి ఉంటుంది. అక్కడ నిర్వాహకులు ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్ వివరాలు సక్రమంగా ఉంటేనే రైతుల వేలిముద్రలు తీసుకుని మక్కలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ విధానం వల్ల కేంద్రాలకు రైతులే వస్తారు. మధ్య దళారులు, వ్యాపారులు రైతుల పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు పట్టుకుని వచ్చినా కూడా విక్రయించడానికి వీలు లేదు. దీంతో రైతులకు మద్దతు ధరలు దక్కనున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రైతులు కూడా తొందరపడి వ్యాపారులకు, దళారులకు విక్రయించవద్దని అధికారులు రైతులను కోరుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న శృంగేరి పీఠాధిపతి

- శంకరమఠంలో కుంభాభిషేకం, కలశ ప్రతిష్ఠ
- ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పరిశీలన
- హాజరైన మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది


రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామిని శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి సోమవారం దర్శించుకున్నారు. ధర్మ విజయయాత్రలో భాగంగా శనివారం వేముల వాడకు చేరుకున్న పీఠాధిపతి సోమవారం ఉదయం రాజన్న ఆలయానికి విచ్చేయగా వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభతో స్వాగతం పలికారు. ముందుగా లక్ష్మీగణపతి, రాజరాజేశ్వర స్వామి, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజరాజేశ్వర స్వామి వారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలోని శిల్పకళను పరిశీలించారు.

తూర్పుద్వారం ద్వారా బయటకు వచ్చిన స్వామివారి కళాభవన్ నుంచి రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు జరిగేస్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో భక్తులను ఆశీర్వదిస్తూ ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి. గితె, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, చంద్రయ్య, ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయి సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

శంకరమఠంలో కుంభాబిషకం, కలశ ప్రతిష్ఠ..

వేములవాడ పట్టణంలోని భీమేశ్వర ఆలయ సమీపంలోని శంకరమఠంలో శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహా స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న యాగానికి పూర్ణాహుతి గావించారు. అనంతరం కలశ ప్రతిష్ఠ చేసి కుంభాబిషేకం నిర్వహించారు. శంకరమఠం ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. బ్రాహ్మణ సత్రం గౌరవ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆహ్వానం మేరకు వారిని నివాసానికి చేరుకున్నారు వారి వెంట శంకరమఠం ధర్మాధికారి నమిలికొండ ఉమేష్ ఉన్నారు.

ప్రభుత్వ విప్ నివాసంలో శృంగేరి పీఠాధిపతి..

ధర్మ విజయయాత్రలో భాగంగా వేములవాడకు విచ్చేసిన శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతి మహాస్వామి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి విచ్చేశారు. పీఠాధిపతికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ విప్ కుటుంబ సభ్యులు పీఠాధిపతికి పాదపూజ నిర్వహించి ఆశీర్వచనాన్ని పొందారు.

శృంగేరి పీఠాధిపతి సలహాల మేరకు అభివృద్ధి పనులు

రాజన్న ఆలయంలో విస్తరణ, అభివృద్ధి పనులను శృంగేరి పీఠాధిపతి సలహాలు, సూచనల మేరకు చేపడుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న ఆలయ గెస్ట్ హౌస్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శృంగేరి పీఠాధిపతి చేపట్టిన ధర్మ విజయయాత్ర లో భాగంగా వేములవాడకు విచ్చేసిన స్వామికి ఘనస్వాగతం పలికి విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ప్రాచీన, పవిత్ర క్షేత్రంగా రాజన్న క్షేత్రం వీరజిల్లుతుందన్నారు. శృంగేరి పీఠాధిపతి రాకతో ఆధ్యాత్మికానందంలో మరింత పవిత్రతను సంతరించుకుందన్నారు. రాజన్న ఆలయంలో కొనసాగుతున్న ఆలయ విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి పలు సూచనలు అందజేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు మరింత వేగంగా, సమర్థవంతంగా కొనసాగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో రాజన్న ఆలయ ఈవో రమాదేవి, ఆర్‌అండ్‌బీ అధికారులు, అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.


ఆలయాన్ని పరిశీలిస్తున్న శృంగేరి పీఠాధిపతి

కార్తీక మాసం.. హరిహర ప్రియం..

(5వ పేజీ తరువాయి)

సర్వతికి జ్ఞాపకశక్తి, అజ్ఞానం తొలగుతుంది. మహాలక్ష్మి దేవికి వెలిగిస్తే ఐశ్వర్యం వస్తుంది. దుర్గాదేవికి వెలిగిస్తే కష్టాలు తొలగుతాయి. గంగాదేవికి వెలిగిస్తే సంతోషం ఉంటుంది. రామదేవునికి వెలిగిస్తే అన్నదమ్ముల మధ్య సంఖ్యత ఉంటుంది. తులసీ దేవునికి వెలిగిస్తే సర్వపాపాలు నివారణ లభిస్తాయి. శివపార్వతికి వెలిగిస్తే ధర్మ, అర్థ, కామ, మోక్షాలు కలిగిస్తాయి. లక్ష్మీనారాయణునుడికి వెలిగిస్తే జీవన్ముక్తి కలుగుతుంది. నవగ్రహ దేవతలకు వెలిగిస్తే పేదరికం తొలగి ఆరోగ్యం, తేజోవంతం కలుగుతాయి.

బొమ్మల కొలువులు..

కార్తీక శుక్ల పక్షం మొదటి రోజున మహిళలు బొమ్మల కొలువు తోపాటు గోవర్ధన పూజ నిర్వహిస్తారు. శ్రీకృష్ణ భగవానుడిని బొమ్మగా తయారుచేసి నీరు, పూలు, పెరుగు,కుంకుమ, బియ్యం, మిఠాయిలో నైవేద్యం సమర్పిస్తారు. స్వామి ఆరాధన శ్లోకాలతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. శుక్ల పక్షం రెండో రోజున భగిని అస్త భోజనం అనే పండుగను సోదరుల సంక్షేమం కోసం సోదరిమణులు నిర్వహిస్తారు. కార్తీక మాసంలో వచ్చే కార్తీక శుద్ధ చవితిని నాగుల చవితిగా జరుపుకుంటారు. పరమేశ్వరుడి ఆలయ ప్రాంగణంలో పుట్టలో పాలు పోసి పూజిస్తారు. ఈ మాసమంతా ఆధ్యాత్మిక ఆనందం, సంతోషాలు, విందు భోజనాలతో శుభకార్యాలతో ఆనందంగా గడుపుతారు.

వన భోజనాలు

కార్తీక మాసంలో వన భోజనాలకు ప్రత్యేకత ఉంది. రావి,ఉసిరి, మామిడి, మారేడు వంటి చెట్లకింద సామూహిక వన భోజనాలు చేస్తారు. ఆధునిక కాలంలోనూ ప్రకృతితో ఉన్న అనుబంధం వనభోజనాలతో కనిపిస్తుంది.

గంభీరావుపేటలో రెండు బోరు మోటార్లు ప్రారంభం

గంభీరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీ, గాంధీ చౌక్ వద్ద మంగళవారం రెండు బోరు మోటార్లను బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ ప్రారంభించారు. ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రాంతాలను గుర్తించి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు విన్నవించగా, ఎంపీ నిధులనుంచి రెండు బోర్లను, మోటార్లను మంజూరుచేశారని బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ తెలిపారు. దీంతో బోరు మోటర్లను బిగించి, ప్రారంభించామన్నారు. ప్రజల తరపున బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ మాజీ అధ్యక్షుడు గంట అశోక్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి దెవసాని కృష్ణ, నాయకులు సర్వోత్తమ్, కిషన్‌రావు, సత్యనారాయణ, దేవేందర్, నర్సింలు, నరేష్, స్వామి, రాజేష్ ఉన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



రాచర్లబొప్పాపూర్‌లో దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న మహిళలు



చందుర్తిలో ధనలక్ష్మి పూజలో పాల్గొన్న మహిళలు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రాలతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, అల్మాస్‌పూర్, రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం, వెంకటాపూర్, పదిర, కోరుట్లపేట, కంచర్ల, అడవిపదిర, రంగంపేట, మద్దిమల్ల, గర్జనపల్లి, వన్‌పల్లి, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాపార, వాణిజ్య దుకాణాలు, ఇళ్లను అందంగా అలంకరించారు. దీపాలను వెలగించి లక్ష్మీ పూజలు చేశారు. చిన్నారులు, పెద్దలు టపాసులు కాల్చారు. రాచర్లగుండారం గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు రాజు నాయక్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. తహసీల్దార్లు సుజాత, ముక్తార్‌పాషా, ఎంపీడీవోలు సత్తయ్య, బీరయ్య, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐలు రాహుల్‌రెడ్డి, లక్ష్మణ్, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంలు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

● ఇల్లంతకుంట : దీపావళి వేడుకలు పలు గ్రామాలలో భక్తిప్రపత్తుల మధ్య కొనసాగాయి. వ్యాపార సంస్థలలో సోమవారం ధనలక్ష్మీ పూజలు నిర్వహించారు. ఇళ్లలో కేదారివ్రతాలను మంగళవారం నిర్వహించారు. స్వీటు దుకాణాలు కొనులుదారులతో కలకళలాడాయియువకులు బాణసంచాను ఉత్సాహంగా కాల్చారు. గతంలో కంటే బాణసంచా ధరలు ఎక్కువగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంతో పాటు పోతుగల్, ఆవునూర్, గూడెం, తెర్లుమద్ది, మద్దికుంట, మోయినికుంట తదితర గ్రామాల్లో దీపావళి సంబురాలు నిర్వహించారు. ఇంటింటా టపాసులు పేల్చారు. స్వీట్లు తినిపించారు. దుకాణాల్లో లక్ష్మీపూజలు నిర్వహించారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో దీపావళి వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. దీపావళి సందర్భంగా ఉదయం నుంచి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దీపావళి పురస్కరించుకొని మండలంలోని దుకాణాల్లో లక్ష్మి పూజలు నిర్వహించారు. పలు దుకాణాల లక్ష్మి పూజలకు పలువురు నాయకులు హాజరయ్యారు. రాత్రివేళల్లో పిల్లలు, యువతి, యువకులు టపాసులు కాల్చి ఆనోందోత్సాహాల మధ్య దీపావళి పండగను జరుపుకున్నారు. మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో మంగళవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు పాఠశాలలో పూలతో దీపం ఆకృతిలో ఏర్పాటు చేసి వాటి చుట్టు దీపాలను ఏర్పాటు చేశారు. టపాసులు కాల్చి దీపావళి వేడుకలు జరుపుకున్నారు.

● చందుర్తి : చందుర్తి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో దీపాలవళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజమున ఇళ్లలో మంగళహారతులు తీసుకున్నారు. సాయంత్రం కేదారీశ్వర,సత్యనారాయణ వ్రతలు జరుపుకున్నారు. వ్యాపారులు దుకాణలలో ధనలక్ష్మి పూజలు చేశారు. రాత్రివేళలో చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు టపాసులు పేల్చి నంబరాలు జరుపుకున్నారు.

ఈ వేడుకల్లో సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ తిప్పని శ్రీనివాస్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, నాయకులు చిర్రం తిరుపతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం దీపావళి పర్వదిన పండగ సంబరాలను ప్రజలు సంతోషాల మధ్య జరుపుకున్నారు. దీపావళి పండగ సందర్భంగా ప్రజలు దీపాల కాంతుల మధ్య టాపాసులు కాల్చారు. మహిళలు, చిన్నారులు ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు. భక్తి శ్రద్ధలతో లక్ష్మీపూజలు చేశారు. ప్రజలు ఆనందోత్సాహాలతో దీపావళి పండగను జరుపుకుంటూ లక్ష్మీపూజల్లో పాల్గొన్నారు.



రుద్రంగిలో టపాసులు కాలుస్తున్న చిన్నారులు

అరుణాచలం గిరి ప్రదర్శనకు ప్రత్యేక డీలక్స్ బస్సు..

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం గిరి ప్రదక్షిణ చేయాలనుకొనే భక్తుల కోసం జిల్లా కేంద్రం కొత్త బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్‌రావు తెలిపారు. మంగళవారం డిపో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 5పౌర్ణమి రోజున తమిళనాడు అరుణాచలం గిరి ప్రదక్షిణ ఉంటుందని అందుకోసం సిరిసిల్ల డిపో నుంచి డీలక్స్ బస్సు సర్వీస్‌ను నడిపించాలని నిర్ణయించామన్నారు. నవంబరు 3న మధ్యాహ్నం సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుంచి వయా హైదరాబాద్ మీదుగా అరుణాచలంకు బయలుదేరుతుందన్నారు. టూర్ ప్యాకేజీలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ కాణిపాకం, వెల్లూరు శ్రీమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని నవంబరు 4రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. భక్తుల గిరి ప్రదక్షిణ అనంతరం నవంబరు 6న సాయంత్రం తిరిగి బస్సు భక్తులతో కలిసి సిరిసిల్లకు బయలుదేరుతుందన్నారు. టూర్ ప్యాకేజీ పెద్దలకు రూ.4100, పిల్లలకు రూ.3100 టికెట్టు ధరలను నిర్ణయించామన్నారు. ప్యాకేజీలోనే టోలుటాక్సీలు, దేవస్థాన దర్శన చార్జీలు ఉంటాయన్నారు. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట, వీర్నపల్లి, ఇల్లంతకుంటకు చెందిన ప్రజలు సమీపంలోని టీజీఎస్‌ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలో బుకింగ్ చేసుకోవచ్చునన్నారు. వివరాలకు సెల్ : 9063152130, 9959225929 నంబర్లను సంప్రదించాలన్నారు.

గడువు పెంచినా దరఖాస్తులు నిల్

- ఆసక్తి చూపని మద్యం వ్యాపారులు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల టెండర్‌లకు రెండు రోజులే మిగిలి ఉంది. గడువు పెంచిన తొలిరోజు దరఖాస్తుల దాఖలుకు వ్యాపారులు ఆసక్తికనబరచ లేదు. జిల్లాలోని 48 వైన్స్‌లలో 9 గౌడ్స్‌కు, 5ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. గత నెల 26న ప్రారంభమైన టెండర్ షెడ్యూలు ఈనెల 18న ముగిసినప్పటికీ అంచనాకు తగిన దరఖాస్తులు రాలేదని ఈనెల 23వరకు గడువు పెంచారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దర ఖాస్తు స్వీకరణ కేంద్రంలో మంగళవారం ఒక్క దరఖాస్తు దాఖలు కాలేదు. ఇక బుధ, గురువారాల్లో 500 దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ శాఖ ఆశలు పెట్టుకుంది.

సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర భవిష్యత్తు రూపకల్పన కోసం చేపట్టిన తెలంగాణ రైజింగ్-2047లో సిటిజన్ సర్వేకు ప్రజలందరు సహకరించిలని కలెక్టర్ ఎం. హరిత ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటివరకు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజులు పాల్గొని విలువైన సమచారాన్ని అందించారని, 2047 నాటికి రాష్ట్రం ఎలా ఉంటుందో ప్రజలు నుంచి సలహాలు, సూచనలు చేపట్టడినికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేను చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతవారం ప్రారంభించిన ఈ సర్వేను చేపట్టిందన్నారు. సర్వే ఈనెల 25వ తేదీతో ముగిస్తుందని సర్వే ప్రతిఒక్కరికి అందుబాటులో ఉన్నందున సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లిలో మహిళా సంఘాల సభ్యులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామంలోని సంఘభవన ఆవరణలో మంగళవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతు తాళ్లపల్లి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహణ బాధ్యతలు సహకార సంఘానికి అప్పగించాలని అధికారులు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యేకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు సింగిరెడ్డి మాధవి, ఉపాధ్యక్షురాలు ఎలుక ఇందిర, కార్యదర్శి ఎలుక బాలమణి, సహాయకార్యదర్శి బట్టు సంతోష, కోశాధికారి అబ్బు ఉమచ కాంగ్రెస్ నాయకులు ఎలుక రామస్వామి, తిరుపతిగౌడ్, బోడ కమలాకర్‌రెడ్డి, మాడుగుల మహేందర్‌రెడ్డి, గుర్రం ఆదిరెడ్డి, జేరిపోతు చంద్రయ్య, సింగిరెడ్డి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ సరుకులు పక్కదారి?

వేములవాడ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ గోదాంలోని సరుకులు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వేములవాడలో వినిపిస్తున్నాయి. ఆలయ సూపరింటెండెంట్ వద్ద పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి సరుకులను సంచిలో తీసుకువచ్చి భీమేశ్వర సదన్‌లో పార్కు చేసిఉన్న కారులో పెట్టడం కలకలం సృష్టించింది. సోషల్‌మీడియాలో ఈ దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఈవో రమాదేవిని వివరణ కోరగా సదరు వీడియోలు తమ దృష్టికి వచ్చాయని, నిజానిజాలతో నివేదిక తయారుచేయాల ని ఏఈవోకు ఆదేశాలు జారీచేశామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్ వితరణ..

తంగళ్లపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాసాని వేణు జ్ఞాపకార్థం తల్లి కాసాని ఎల్లవ్వ రూ. 12వేల విలువ చేసే టై, బెల్ట్, ఐడీకార్డులను వితరణగా అందించారు. అలాగే తాగునీటి ఆర్వో ప్లాంట్‌కు రూ.6వేల వ్యయంతో మరమ్మతులు చేయించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయులు గోలి రాజు, ఉపాధ్యాయులు విష్ణు, అంజయ్య, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, తల్లి దండ్రులు శేఖర్, రాజు, రమేష్, లావణ్య, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులపైకి దూసుకొచ్చిన కారు

వేములవాడ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్‌వైపున గల మార్కెట్ యార్డు వద్ద హోల్‌సెల్ కూరగాయల రైతులపైకి మంగళవారం తెల్లవారుజామున ఓ కారు దూసుకొచ్చింది. రైతులు కారును ఆపి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో అరగంటసేపు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. స్థానికులు ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. గతంలోనూ తిప్పాపూర్ బ్రిడ్జి వద్ద కూరగాయలు విక్రయించే రైతులపైకి లారీ దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది.

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి..

ఇల్లంతకుంట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎస్సై సిరిసిల్ల అశోక్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం అనేక మంది అమరులయ్యారన్నారు. అదనపు ఎస్సై లక్పతి, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, పీసీలు అనీల్, సురేష్, వెంకటేశం, యువకులు పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం..



ఎల్లారెడ్డిపేటలో వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు



ఇల్లంతకుంటలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో సోమవారం వేకువజామున వర్షం కురిసింది. సుమారు గంట పాటు వానకు మండల కేంద్రాలతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర, నారాయణపూర్, కంచర్ల, మద్దిమల్ల, రంగంపేట, తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. ధాన్యపు కుప్పలపై కప్పిన కవర్లలో నిలిచిన వర్షపు నీటి తొలగించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యం ఆరబెట్టడంలో నిమగ్నమయ్యారు. కేంద్రాలను ప్రారంభించిన తూకం వేయకపోవడం వల్ల ధాన్యం తడిసిపోయిందని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను ప్రారంభించాలని కోరారు.

● ఇల్లంతకుంట : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం భారీ వర్షంతో తడిసిపోయింది. మండలంలోని రేపాక, ఇల్లంతకుంట, ముస్కానిపేట తదితర గ్రామాల్లో సోమవారం కురిసిన వర్షంతో రైతులు వ్యవసాయ బావుల వద్ద, కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. వర్షపు నీటికి కొంత ధాన్యం కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుచున్నారు. కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటుచేసి దాన్యాన్ని సేకరిస్తే ఈపరిస్థితి వచ్చేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం దేవునితండా గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిచి ముద్దయింది. దేవుని తాండకు చెందిన రైతుల ధాన్యం వరద నీటికి కొట్టుకపోయిందని రైతులు వాపోయారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి పది రోజులు అవుతున్న ఇప్పటివరకు కొనుగోలు ప్రారంభించలేదన్నారు. వర్షం కురవడంతో తడిచిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కుటుంబం సభ్యులు ధాన్యం రాశుల వద్దనే ఉంటూ పడిగాపులు కాస్తున్నామన్నారు. వర్షానికి తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లు అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేయకపోవడం వల్ల రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నామన్నారు. వరద నీటికి కొట్టుకపోయిన ధాన్యానికి నష్టపరిహారం ఇవ్వాలని రైతులకు కోరారు. అధికారులు ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలన్నారు.



దేవుని తండాలో తడిసిన ధాన్యం

పంచాయతీ కార్యదర్శి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు, గ్రామస్థులు

- కాషాయ తొలగింపుపై వివాదం..

- గ్రామస్థుల ఆగ్రహం..

కోనరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో దీపావళి పండుగ రోజున కాషాయ జెండా తొలగించడంపై తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నాగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ అఫ్సాన ఆదేశాల మేరకు గ్రామంలోని పొట్టిగుట్టపై ఆర్ఎస్ ఎస్ వలంటీర్లు ఏర్పాటు చేసిన కాషాయ జెండాను అనుమతి లేకుండా తొలగించారంటూ గ్రామస్థులు, స్థానిక యువకులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఆర్ఎస్ఎస్ నాయకులు మాట్లాడుతూ హిందుత్వ భావోద్వేగాలకు, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా భావించే కాషాయ జెండాను పవిత్రమైన దీపావళి పండుగ రోజున తొలగించడం జాతీయ సాంస్కృతిక సంప్రదాయాలను అవమానించడమేనని అన్నారు. తాము ఎలాంటి అనుమతులు లేకుండా జెండాను ఏర్పాటు చేయలేదని, దీనిని తొలగించడం భావోద్వేగాలను రెచ్చగొట్టడమేనని ఆరోపించారు. అనంతరం ఈ విషయమై తహసీల్దార్ వరలక్ష్మికి ఫిర్యాదు చేశారు. అనంతరం తొలగించిన పొట్టిగుట్టపై కాషాయ జెండాను తిరిగి ఎగురవేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సత్సంగ సదనం వార్షికోత్సవాలకు సంబంధించిన కర పత్రాలను సత్సంగ సదనం సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 24 నుంచి నవంబరు 1తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నామని సదనం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు బండలింగంపల్లి గ్రామాల్లో శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, అంబేద్కర్ మాదిగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలను సోమవారం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా లింగాగౌడ్, అనిల్, కోశాధికారిగా జితేందర్‌లను ఎన్నుకున్నారు. అంబేద్కర్ మాదిగ సంఘం అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షులుగా మల్లయ్య, బాలరాజులు ఎన్నికయ్యారు. ప్రధానకార్యదర్శి, కార్యదర్శి, కోశాధికారులుగా దేవరాజు, దేవయ్య, నర్సింలును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా నర్సయ్య, దేవరాజు, శంకర్, దేవయ్య, లక్ష్మణ్, బాబులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, వివిధ కుల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



శివకేశవుల చావా శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ముస్తాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని శివకేశవుల ఆలయ కమిటీ చైర్మన్ మిరుదొడ్డి శరయ్య ఆధ్వర్యంలో అర్చకులు హరీశ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర తీశారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నర్సింహరెడ్డి, సంతోష్‌రావు, గ్రామస్థులు అనిల్‌రెడ్డి, వేముల సత్యనారాయణ, యెల్ల గిరి, శీలం స్వామి, సద్ది మధు, శీల ప్రశాంత్, రంజాని నరేష్, దీటి నర్సింలు, అన్నం శ్రీధర్‌రెడ్డి, జాల భిక్షపతి, బండారి సత్తయ్య, చెవుల మల్లేశం, గూడెపు రవి, మిరుదొడ్డి భాను, యాగండ్ల మల్లేశ్, బాలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

నక్సలైట్ల స్తూపానికి.. పోలీస్ అమరవీరుల ఫ్లెక్సీ..

- సోషల్ మీడియాలో వైరల్ - తొలగించిన పోలీసులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నక్సల్స్ అమరవీరుల స్తూపానికి ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల ఫ్లెక్సీ మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈనెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముద్రించిన ఓ ఫ్లెక్సీ వీర్నపల్లి మండలకేంద్రంలోని నక్సల్స్ అమరవీరుల స్తూపానికి కట్టి ఉంది. ఈ విషయమై పలువురు చర్చించుకోవడంతో తెలుసుకున్న పోలీసులు ఫ్లెక్సీని తొలగించారు. ఎస్ఐ లక్ష్మణ్‌ను వివరణ కోరగా తమ సిబ్బంది తెలియక నక్సల్స్ అమరవీరుల స్తూపానికి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని, తమ దృష్టికి వచ్చిన వెంటనే తొలగించామన్నారు.

కార్మికుల హక్కులను సాధించే వరకు పోరాడాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను సాధించే వరకు ఉద్యమించాలని ప్రజా సంఘాల నాయకుడు అరుణ్‌కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ అనుబంధమైన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం ప్రతి కార్మికులు ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల కోసం కేటాయించాల్సిన సంక్షేమ బోర్డులోని డబ్బులను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను ఎండగడుతూ కార్మికుల హక్కుల సాధనకు నడుం బిగించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నరాజం, ఉపాధ్యక్షులుగా మోహన్, రాజయ్య, కార్యదర్శి, కోశాధికారులుగా రవి, శంకర్‌లు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులు, సభ్యులుగా రాజేశం, రమేశ్, లింగం,రాజు, గోపి, వెంకట్, దేవయ్య, చంద్రయ్య, రాజం, అంజయ్యలు వ్యవహరించనున్నారు. సమావేశంలో నాయకులు నరేందర్, రాజ ఎల్లయ్య, దేవయ్య, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుడికి సన్మానం

ఇల్లంతకుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శబరిమలకు పాదయాత్ర ద్వారా చేరుకొని స్వామివారి దర్శనం చేసుకొని తిరిగివచ్చిన అయ్యప్ప భక్తుడు అంతటి రామచంద్రంను గ్రామస్థులు సత్కరించారు. ముస్తాబాద్ రాజు గురుస్వామి ఆధ్వర్యంలో 60రోజులలో 1400 కిలోమీటర్ల దూరంలోని శబరిమలకు చేరుకున్నారు. స్వగ్రామం అయిన ఇల్లంతకుంటకు రామచంద్రం సోమవారం చేరుకోగా అయ్యప్పసేవా సంఘ సభ్యులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎర్రోజు గోపాలచారి. ఈదుల రవీందర్‌రెడ్డి, మంద చక్రాదర్‌రెడ్డి, కట్ట ఎల్లారెడ్డి, ముంజ భూపతి, ఎర్రోజు సత్యం తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

చందుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :చందుర్తి మండలం మాల్యాల గ్రామానికి చెందిన లింగాల భూమయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. భూమయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మల్యాల గ్రామంకు వెళ్లి భౌతికాయానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తపరిచారు.

చికిత్స పొందుతున్న యువకుడికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అక్కపల్లికి చెందిన యువకుడు రాకేశ్‌ను కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. నర్సయ్య, గౌస్, తిరుపతిరెడ్డి, అనిల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు నగదురహిత లావాదేవీలను కొనసాగించాలని సెర్ప్ఏపీఎం నర్సయ్య అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో మహిళా సంఘాల సభ్యులకు నగదు రహిత లావాదేవీలపై మంగళవారం అవగాహన కల్పించా రు. ఈసందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ స్వయంసహాయక సంఘాల సభ్యులు ఆండ్రా యిడ్ స్మార్ట్ ఫోనులో నగదు రహిత లావాదేవీల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు మల్లయ్య, సత్యానందం, సీఆర్పీఎస్‌లు జ్యోతి, చామంతి, వీవోఏ రేణుక, సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

గంభీరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత యాదవ మహాసభ గంభీరావుపేట మండల అధ్యక్షుడిగా ముస్తాఫనగర్‌కు చెందిన దోమకొండ కృష్ణకాంత్‌యాదవ్ నియామకయ్యారు. ఈ మమేరకు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు అన్నబోయిన తిరుపతి యాదవ్ చేతుల మీదుగా కృష్ణకాంత్‌యాదవ్ నియామక పత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, మండల నాయకత్వానికి యాదవ సంఘ నాయకులకు కృష్ణకాంత్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా యాదవ సంఘాల కన్వీనర్ సొగాని కొమురయ్యయాదవ్, రాష్ట్ర నాయకులు మల్లేశంయాదవ్, వీరవేని మల్లేశ్‌యాదవ్, పెద్దవేని వెంకట్ యాదవ్, మాజీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చెవుల మల్లేశంయాదవ్, మండల కోశాధికారి దేవయ్య, ఉపాధ్యక్షులు మహేష్ తదితరులు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణలు కోరారు. సిరిసిల్ల పట్టణ బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో మంగళవారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభలు ఈనెల 29, 30వ తేదీల్లో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మూషం రమేష్, గుర్రం అశోక్, అన్నల్‌దాస్ గణేష్, గురజాల శ్రీధర్, సూరం పద్మ తదితరులు పాల్గొన్నారు.